క్లుప్తంగా

నిబంధనలు తప్పనిసరి


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ మధుకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తూప్రాన్– నర్సాపూర్ హైవేపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలకు వ్యతిరేకంగా వెళ్తున్న వాహనదారులకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించి పత్రాలు వెంట ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

ఎల్లమ్మ తల్లికి పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నర్సాపూర్: నర్సాపూర్ రాయరావు చెరువు కట్టపై వెలిసిన రేణుకఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

శాకాంబరీదేవిగా దర్శనం


శాకాంబరీదేవిగా నల్ల పోచమ్మదేవి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢ మాసం ఆదివారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీశారు. ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతిచెందిన గేదె

టేక్మాల్(మెదక్): విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని బొడ్మట్‌పల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముద్దాపురం నాగప్ప వ్యవసాయంతో పాటూ గేదెను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గ్రామశివారులో గేదెను మేపుతుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. రూ.50వేల నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నిక


సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

పెద్దశంకరంపేట(మెదక్): పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం ఆ సంఘం స్థానిక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా కందుకూరి రవీందర్, గౌరవాధ్యక్షుడిగా దాదిగారి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా చకిలం సంతోష్, కోశాధికారిగా సంగమేశ్వర్, ఉపాధ్యక్షులుగా రాగం సిద్దు, మల్లేషం, సహాయ కార్యదర్శిగా ఎం.రమేష్, పాపిషెట్టి సంతోష్, నరేష్, సహాయ కోశాధికారులుగా రాగం శ్రీను, కొత్త శ్రీనివాస్, దాదిగారి సంతోష్ ఎన్నికయ్యారు.

వైభవంగా బోనాలు

బోనాల పండగను ఆదివారం ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు ఆకట్టుకున్నాయి. నర్సాపూర్ రాయరావు చెరువు కట్టపై వెలిసిన రేణుక ఎల్లమ్మకు కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. పెద్దశంకరంపేట భవాని మందిర్‌లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుగా తరలివెళ్లి బోనాలను సమర్పించారు. చేగుంట మండలంలోని కర్నాల్‌పల్లిలో గ్రామ దేవతలు పోచమ్మ, దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. మహంకాళి ఆలయంలో అమ్మవారిని 1,116 నిమ్మకాయలతో అలంకరించారు. కౌడిపల్లి మండల కేంద్రంలో బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు. పోచమ్మ, ఎల్లమ్మకు బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవతల దయతో ప్రజలు పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి కోరారు.

– నర్సాపూర్/కౌడిపల్లి/పెద్దశంకరంపేట/చేగుంట


చేగుంట: ప్రత్యేక అలంకరణలో మహంకాళి అమ్మవారు


కౌడిపల్లిలో బోనాల సందడి


పెద్దశంకరంపేటలో బోనాల ఊరేగింపు


నర్సాపూర్‌లో పోతరాజుల విన్యాసాలు

రేణుక ఎల్లమ్మకు కాంగ్రెస్ నేతల పూజలు


రేణుక ఎల్లమ్మకు పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు కుమ్మరి సురేశ్ తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన రేణుక ఎల్లమ్మ తల్లికి నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కుమ్మరి లక్ష్మి, లలిత, శ్రీనివాస్‌గుప్తా, అంజిగౌడ్, సుధీర్‌గౌడ్, నగేశ్, హబీబ్‌కాన్, కృపాచారి, సాగర్, రవి, సంజీవ తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం సురేశ్ వారిని శాలువాలతో సత్కరించారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతం

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్ కమిటీలను బలోపేతం చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లేష్ అన్నారు. ఆదివారం మండల పరిధి ఎదుల్లాపూర్‌లో ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణ పనులు ప్రారంభించారు. దళితుల హక్కుల సాధనలో కీలక భూమిక వహిస్తున్న ఎమ్మార్పీఎస్‌కు అందరూ బాసటగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మణ్, కుమార్, నరసింహులు, వెంకటేష్ ఉన్నారు.

అమ్మా.. చల్లంగా చూడమ్మా..


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న మైనంపల్లి హన్మంతరావు తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలలో ఆషాఢమాస బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మనోహరాబాద్‌లో జరిగిన బోనాల వేడుకలలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి తదితరులున్నారు. ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేద్దాం

డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

సంగారెడ్డి: జూలై 19న న్యూఢిల్లీ హెచ్‌కెఎస్ సుర్జీత్ భవన్ వద్ద నిర్వహించనున్న అఖిల భారత నిరుద్యోగ సదస్సును విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల మాటను నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. సభకు యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎం శ్రీకాంత్, సాయి, ప్రశాంత్, శ్రీకాంత్, హరినాథ్ రెడ్డి, శివ, సాగర్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంపుపై హర్షం

బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ప్రభుగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుగౌడ్

సంగారెడ్డి: బీసీ రిజర్వేషన్లు పెంపుపై అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం బీసీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుగౌడ్ మాట్లాడుతూ.. బీసీల విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి బీసీలకు ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నిర్వహించారన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గోకుల్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్, జిల్లా ముఖ్య సలహాదారులు చంద్రయ్య స్వామి, జిల్లా కార్యదర్శి సుధాకర్ గౌడ్, సభ్యులు పాల్గొన్నారు,


లింకురోడ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రింగ్ రోడ్లతో నారాయణఖేడ్ అభివృద్ధి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నూతన లింక్‌రోడ్లు, బైపాస్ రోడ్లతో పట్టణం విస్తరించడంతో పాటు అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ పట్టణం చుట్టూ లింకురోడ్లుగా నిర్మిస్తున్న రింగురోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణం చుట్టూ రింగు రోడ్డు నిర్మిస్తుండగా.. పట్టణానికి కొంత దూరంలోని గ్రామాలను కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పట్టణంలో ప్రధాన రోడ్లను సీసీతో విస్తరణ, రోడ్డుకు ఇరుపక్కలా విశాలమైన మురుగు కాల్వలు, డివైడర్ల కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆయా పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు దూరమై, వ్యాపార, వాణిజ్య అవకాశాలు పెరిగి పట్టణ రూపురేఖలే మారిపోతాయన్నారు. రింగ్, ఔటర్ రింగ్ రోడ్ల కారణంగా పట్టణం 5 నుంచి 8కిలోమీటర్ల మేర విస్తరణ జరుగుతుందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు అవుటి శంకర్, తౌసిఫ్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సంగారెడ్డి: పట్టణంలోని 9వ వార్డు ఆర్టీసీ కాలనీలో రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూతూ.. కాలనీలోని రోడ్లు బురదమయంగా మారడంతో సీసీ రోడ్డును వేస్తున్నట్లు పేర్కొన్నారు. దశలవారీగా పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టడమే ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శితో బాజీ అనంతకిషన్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, శంకర్, రాజు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి


కాలనీలను సందర్శించిన సీపీఎం నాయకులు

సంగారెడ్డి టౌన్: డబుల్ బెడ్రూం కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి అన్నారు. ఆదివారం సంగారెడ్డి మండలంలోని ఫసల్వాది గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ డ్రైనేజీ నిండిపోవడంతో మురికి నీళ్లు ఇళ్లల్లోకి వస్తున్నా యని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, వీధిలైట్లను సరి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు శ్రీనివాస్, అలీ, లక్ష్మణ్, యాదయ్య, జావీద్ పాల్గొన్నారు .

వాటర్ ప్లాంట్ మూసేయడంతో ఇబ్బందులు


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మినరల్ వాటర్ ప్లాంట్ మూసేయడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. మండల పరిధి చెన్నాపూర్ గ్రామంలో దాతల సహకారంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించారు. మెయింటైన్స్ కోసం ఐదు రూపాయలకు బబుల్ చొప్పున గ్రామస్తులకు అందుబాటులో ఉంచారు. రెండు రోజుల నుంచి గ్రామపంచాయతీ సిబ్బంది వాటర్ ప్లాంట్‌ను మూసేయడంతో నీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి మినరల్ వాటర్ గ్రామస్తులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి శోభారాణి దృష్టికి తీసుకెళ్లగా వాటర్ ప్లాంట్‌కు సంబంధించి మిషనరీ సమస్య రావడంతో నీరు ఫిల్టర్ కావడం లేదని మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తూప్రాన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1967–68 సంవత్సరానికి చెందిన హెచ్ఎస్సీ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయుడు కిష్టయ్యను ఘనంగా సన్మానించారు. కాగా పూర్వ విద్యార్థులు పలు రంగాల్లో స్థిరపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యాదగౌడ్, పాపిరెడ్డి, శంకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సాగౌడ్, అభిబోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో యూరియా కొరత లేదు


ఫైజాబాద్‌లో స్టాక్ పరిశీలిస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 70 మెట్రిక్ టన్నుల యూరియా, 10 మెట్రిక్ టన్నుల డీఏపీ, 83 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో అన్ని రకాలు ఎరువులు ఉన్నాయని, ఎరువులకు ఎలాంటి కొరత లేదని చెప్పారు. రైతులు ఎలాంటి మోసాలకు గురవ్వకుండా, ఎరువులు, విత్తనాలు కోనుగోలు చేసిన వెంటనే సంబంధిత రశీదులు తీసుకోవాలని సూచించారు.

చాముండేశ్వరి అమ్మవారికి పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ అర్చకుడు అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

వృథాగా పోతున్న నీరు


గేట్‌వాల్ నుంచి నీరు వృథా

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలోని మీని స్టేడియం సమీపంలో మిషన్ భగీరథ గేట్‌వాల్ నుంచి నీరు వృథాగా పోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం భారీగా నీరు వృథాగా పోవడాన్ని గ్రామస్తులు చూసి మొబైల్ ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి గేట్‌వాల్ మరమ్మతులు చేపట్టి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

జోగిపేట(అందోల్):జోగిపేట పట్టణంలోని మొలంగ్‌షా దర్గాలో ముస్లింలు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం దర్గా ఆవరణలో ముస్లింలకు భోజనాలు ఏర్పాటు చేశారు. దర్గాలో గంధం, పూల చదర్‌ను కప్పి ప్రార్థనలు చేశారు. మతపెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

నూతన కాలనీలకూ 'మిషన్ భగీరథ'

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


నల్లా కనెక్షన్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలకు ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నవ్యకాలనీలో నల్లా కనెక్షన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అమీన్‌పూర్ అంటేనే మంచినీటి కొరతకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. దశాబ్ద కాలంగా ప్రణాళికబద్ధంగా నూతన రిజర్వాయర్లు నిర్మిస్తూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే బంధం కొమ్ము రిజర్వాయర్ సైతం ప్రారంభిస్తామని చెప్పారు. మంచినీటి కొరత రాకుండా ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నూతన కల్వర్టు ప్రారంభం

పటాన్‌చెరు: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని మరనాత హీలింగ్ టెంపుల్ చర్చి సమీపంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన కల్వర్టును ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఒక్కరి మతాన్ని గౌరవిస్తూ.. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, చర్చి నిర్వాహకులు భాస్కరరావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో దివ్యాంగులతో సమావేశం

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలోని దివ్యాంగులతో అతి త్వరలో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం రాత్రి నియోజకవర్గంలోని పలువురు దివ్యాంగులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. దివ్యాంగులందరినీ సొంత కుటుంబ సభ్యుల వలే కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. గతంలో నియోజకవర్గంలోని 450 మంది దివ్యాంగులకు ఐదు కోట్ల రూపాయల సొంత నిధులతో ద్విచక్ర వాహనాలను అందించానని గుర్తు చేశారు. స్పందించిన దివ్యాంగులు ఆ ద్విచక్ర వాహనాలతోనే క్యాంపు కార్యాలయం వరకు వచ్చామని ఎమ్మెల్యేతో అన్నారు. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు.